క్లుప్తంగా

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీటీసీ గౌరి, సర్పంచ్ తేరీజమ్మ

సీతానగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదబోగిలి ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.గౌరి, సర్పంచ్ జె.తేరీజమ్మ కోరారు. మండలంలోని పెదబోగిలి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శనివారం పాలు, గుడ్లు పంపిణీ చేశారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులు, పుట్టిన బిడ్డ ఆరోగ్యం కోసం బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని వారు తెలిపారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే మన బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ ప్రమీల తదితరులు

పాచిపెంట: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురివినాయుడుపేట సచివాలయంలో వలంటీర్లను శనివారం సన్మానించారు. సర్పంచ్ గొట్టాపు చిట్టెమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ బడ్నాన ప్రమీల హాజరై, వలంటీర్ల సేవలను ప్రశంసించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పారదర్శంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, సర్పంచ్‌లు చింత సీతయ్య, దండుపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓల నిరసన

పాలకొండ రూరల్: ఎన్‌జీఓ జేఏసీ పిలుపు మేరకు ఎన్‌జీఓలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, ఎన్‌జీఓ సంఘ నాయకులు పైల ఈశ్వరావు, గౌరీశ్వర రావు, అనూష్‌బాబు, తదితరులున్నారు.

స్వేచ్ఛగా ఓటేసేలా ఏర్పాట్లు

వీరఘట్టం: పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే కమ్యూనికేషన్ సులువుగా అందేలా.. మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ డీఈఈలు గౌరీశంకరరావు, లోకనాథం, మండల ఇంజినీరింగ్ అధికారి కల్యాణిదుర్గ, వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి

వీరఘట్టం: డ్వాక్రా సంఘాల బలోపేతానికి అందరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ వై.సత్యంనాయుడు సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీసుకున్న రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, ఏపీఎం జి.శివున్నాయుడు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ బాధ్యత అందరిదీ..

గుమ్మలక్ష్మీపురం: అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండ ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పి.దేవానంద్ అన్నారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఎం.నీలమణి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు అడవులు-వాటి ప్రాధాన్యత- ఫారెస్ట్ ఫైర్ నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం తగ్గిపోవడం వల్ల వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, తద్వారా వర్షాలు సక్రమంగా కురవని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడవులు ప్రాధాన్యతపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు, స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. అటవీశాఖ వాచర్లు పి.ప్రసాదరావు, వి.కరుణాకరావు, పి. పోలిరాజు, ఉపాధ్యాయులు జి.గణేష్, సుబ్బారావు ఉన్నారు.

నాడు నిర్లక్ష్యం.. నేడు అభివృద్ధి పథం!

- ప్రగతి పథంలో పెదబొండపల్లి గ్రామం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జోరుగా అభివృద్ధి
- గతంలో ఎన్నడూ లేనంతగా మౌలిక వసతులకు ప్రాధాన్యం
- రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భవనాల నిర్మాణం
- గ్రామంలోనే అన్ని సదుపాయాలు దొరికేలా చర్యలు



గ్రామంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు



కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మండలంలోని పెదబొండపల్లి గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరగడంతో గ్రామం కొత్తరూపు సంతరించుకుంది. గ్రామంలోని ఏ మూలకు వెళ్లినా సీఎం జగనన్న మార్క్ పాలన కనిపిస్తుంది. ప్రధానంగా ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి వసతులు కల్పించడం దగ్గర నుంచి గ్రామంలోనే వైద్యసేవలు అందేలా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడానికి రైతు భరోసా కేంద్రం నిర్మాణం, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయం నిర్మాణం వంటివి చేయడం జరిగింది. దీంతో గ్రామంలోనే అన్ని సౌకర్యాలు లభిస్తుండడంతో గ్రామస్తులంతా ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు అభివృద్ధికి దూరం..

పార్వతీపురం పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబొండపల్లి గ్రామం కూరగాయలు, జనపనార, పాడిపంటలకు ఎంతో ప్రసిద్ధి. అప్పట్లో సాగు తప్ప అభివృద్ధి అంటే ఏంటో ఆ గ్రామస్తులకు తెలీదు. గ్రామంలో ఏ ఒక్క పని కావాలన్నా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీల కాళ్లచుట్టూ తిరుగుతూ వారికి తాయిలాలు అందిస్తే గానీ పని జరిగేది కాదు. ఓట్లు అప్పుడు మాత్రమే గ్రామం ముఖం చూసే రాజకీయ నాయకులు ఎన్నికైన తర్వాత మళ్లీ గ్రామం వైపు చూడని పరిస్థితి. దీంతో గ్రామం ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ గ్రామంలో ప్రజల మౌలిక వసతులకు ప్రాధాన్యమిచ్చింది. ఈ క్రమంలో గ్రామంలో గతంలో కన్నా ఇప్పుడు సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి.

ఓ వైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు అన్నివర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నారు. ఓ వైపు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు ప్రతీ గ్రామంలో అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో పెదబొండపల్లి గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసింది. నాడు-నేడు పథకం ద్వారా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ విద్యాసంస్థకు దీటుగా మార్చారు. రూ.3.82 లక్షల నిధులతో ప్రభుత్వ బడిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో పాటు గ్రామంలోనే రూ.7 లక్షల నిధులతో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. అంతవరకు అద్దె భవనంలో గ్రామ సచివాలయాన్ని రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనంలోకి మార్చారు. అభివృద్ధితో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామంలో రైతు భరోసా కేంద్రం భవనం



నాడు-నేడు పథకంలో భాగంగా మారిన పాఠశాల రూపురేఖలు

మా ఊరు మారింది..



ఇప్పుడు మా ఊరు మారింది. గతంలో మా గ్రామానికి వెళ్లాలంటే రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో రోడ్లు, కాలువలు వేశారు. ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకం వస్తోంది. నా సొంతింటి కల కూడా నెరవేరింది. – అలమండ తేరీజమ్మ, ఇంటిస్థల లబ్ధిదారు, పెదబొండపల్లి.

ఒకప్పుడు పేకాట స్థావరంగా పాఠశాల..



ఒకప్పుడు మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పేకాట స్థావరంగా ఉండేది. వైఎస్సార్ సీపీ చేపట్టిన నాడు-నేడు పథకంలో భాగంగా గ్రామంలోని పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా మార్చి, పాఠశాలలోకి ఇతరులు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. – గోడబ సూరమ్మ, పెదబొండపల్లి గ్రామం.

గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి..



గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని సీఎం జగనన్న హయాంలో చూస్తున్నాం. ముఖ్యంగా మా గ్రామం అభివృద్ధి చెందిన తీరే దీనికి నిదర్శనం. గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణంతో పాటు రోడ్లు, కాలువలు వేసి గ్రామం రూపురేఖలు మార్చారు. ఇప్పుడు మా గ్రామం అని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. – మండల బలరాంనాయుడు, పెదబొండపల్లి గ్రామం.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు



పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరాతీస్తున్న తహసీల్దార్ జనార్ధన్

సీతానగరం: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ జి.వి.జనార్ధన్ అన్నారు. శనివారం మండలంలోని దయానిధిపురం, జానుమలువలస, గాదెలవలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడి సదుపాయాలను పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి వసతులతో పాటు దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపు ఉండేలా చూడాలన్నారు. కాశిపేటలో పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపు ఏర్పాటుకు సంబంధిత అధికారులకు నివేదిక పంపించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు



వెంకటభైరిపురం వెల్‌నెస్ సెంటర్‌లో ఆన్‌లైన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

మక్కువ: గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని వెంకటభైరిపురం, కాశీపట్నం గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్‌లను శనివారం సందర్శించిన ఆయన అక్కడి రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డును పరిశీలించారు. రోజుకు ఎంతమంది ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో వస్తున్నారని, వారికి ఏ రకమైన చికిత్స అందిస్తున్నారని ఆరాతీశారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం బాగున్నదీ లేనిదీ నిత్యం పర్యవేక్షించాలన్నారు. జ్వర లక్షణాలతో బాధపడున్న వారిని వెంటనే గుర్తించి, రక్తపరీక్షలు చేయాలన్నారు. గ్రామీణుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసిందని, వీటిలో 14 రకాల రక్తపరీక్షలు చేయడంతో పాటు 105 రకాల మందులు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రజలంతా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కాశీపట్నంలోని కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులతో కూడా ఆయన మాట్లాడి, వారికి కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగదుర్గ, వెల్‌నెస్ సెంటర్‌ల సీహెచ్‌వోలు విజయ్‌కుమార్, శోభిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు



న్యాయసేవలపై అవగాహన కల్పిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.గోపాలరావు

పార్వతీపురంటౌన్: జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.గోపాలరావు పలు న్యాయచట్టాలు, న్యాయసేవలపై అవగాహన కల్పించారు. పౌరులు ఏ సేవలు వినియోగించుకున్నా రిజిస్ట్రేషన్లు తప్పనిసరి అని, కుల ధ్రువీకరణ, ఆస్తి ధ్రువీకరణ, స్థలం, వాహనాలకు సంబంధించి పక్కాగా రిజిస్ట్రేషన్లు ఉండాలని తెలిపారు. కోర్టు తగాదాలలో ఎక్కువ శాతం ఆస్తి తగాదాల్లో రిజిస్ట్రేషన్లు లేకపోవడం వలనే ఎక్కువ కేసులు నమోదవుతున్నాయన్నారు. ముఖ్యంగా వాహనాలు ఇతరుల వద్ద నుంచి కొనుగోలు చేసేటప్పుడు ధ్రువపత్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వీటిపై మున్సిపల్, రెవెన్యూ, రవాణా శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి అభినందనలు



సుబ్బారెడ్డికి అభినందనలు తెలుపుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం కలిసి, ఆయనకు తన అభినందనలు తెలిపారు.

అభివృద్ధిపై మాట్లాడే అర్హత సంధ్యారాణికి లేదు..

- ఎంపీపీ బడ్నాన ప్రమీల



పాచిపెంట: గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై మాట్లాడే అర్హత టీడీపీ నాయకురాలు సంధ్యారాణికి లేదని ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె ప్రజాక్షేత్రంలో ఒక్కసారి కూడా గెలవలేని సంధ్యారాణి, ప్రజల ఆశీస్సులు, అభిమానంతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో ఉన్న పీడిక రాజన్నదొరను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఆమెను ఆమె సొంత పార్టీ నేతలే సరిగా గుర్తించడం లేదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి సాలూరు నియోజకవర్గంలోని ఏ ఒక్క గిరిజన గ్రామ అభివృద్ధినైనా చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆధ్వర్యంలో గిరిశిఖర గ్రామాలకు సైతం కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మించి, ప్రారంభించడం జరిగిందన్నారు. అంతేకాకుండా తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలుచేసి, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఇప్పటికైనా తమ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం రాజన్నదొరలపై అవాకులు చవాకులు పేలడం మానుకోవాలని హితవుపలికారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, నియోజకవర్గం నుంచి డిప్యూటీ సీఎం కూడా మళ్లీ గెలిచి, సీఎం జగనన్నకు బహుమతిగా తన గెలుపును అందిస్తారన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దింపేటలో రూ.కోటి నిధులతో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం
- భూమిపూజ చేసి, నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపీపీ నాగమణి



పెద్దింపేటలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ నాగమణి

బలిజిపేట: అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నాగమణి అన్నారు. మండలంలోని పెద్దింపేట పంచాయతీ పరిధిలో ఉన్న మూడు గ్రామాల్లో రూ.కోటి నిధులతో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణానికి ఆమె శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఇప్పటికే ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చూస్తున్నారన్నారు. దీనిలో భాగంగా పెద్దింపేటలో రూ.50 లక్షల వ్యయంతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, పోలినాయుడువలస గ్రామంలో మరో రూ.25 లక్షల వ్యయంతో 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, పి.రావివలసలో రూ.25 లక్షల వ్యయంతో 15 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకుల నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. సీఎం జగనన్న చొరవతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామగ్రామాన సంక్షేమం, అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ఇదే మాట ఏ గ్రామానికి వెళ్లినా చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.సాంబమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఏఈ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి మల్లికార్జునరెడ్డి

- జిల్లా రవాణా శాఖ అధికారి మల్లికార్జునరెడ్డి

పార్వతీపురంటౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారి మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కలిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులంతా తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. వాహనాలతో రోడ్డు మీదకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. అతివేగంతో, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శశికుమార్, ఏఎంవీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- టీడీపీ నేతలకు వైఎస్సార్ సీపీ నేతల సవాల్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాలూరు: నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, 2019 నుంచి ఇప్పటివరకు వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని టీడీపీ నేతలకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, పార్టీ నాయకులు జర్జాపు సూరిబాబు, దండి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. ఇదే విషయమై వారు స్థానిక పట్టణంలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన నారా లోకేశ్, సంధ్యారాణిలు నియోజకవర్గంలోని సంక్షేమం, అభివృద్ధిపై చేసిన విమర్శలను వారు ఖండించారు.

టీడీపీ హయాంలో మూడు శాఖలకు మంత్రిగా పనిచేసిన నారా లోకేశ్, నాడు ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. మీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై వివరాలు ఇవ్వాలని, తమ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై వివరాలను తాము ఇస్తామన్నారు. ఈ విషయాలు విలేకరుల ద్వారా ప్రజలకు తెలియజేద్దామన్నారు.